కలికితురాయి

❋

భోగబిడౌజుడైన శ్రీ వాసిరెడ్డి వెంకటాద్రి నాయని వారు,-అమరావతిని, నందన తుల్యంగాచేసి, ప్రజలందరినీ కన్నబిడ్డలతోబాటు పాలించుకుంటూ తమ ఏలుబడిక్రిందికి వచ్చిన పరగణా సమస్తమున్నూ పౌరుష-దైవీకములైన యీతిబాధలు లేకుండాచేసి, చల్లగా కాపాడుతూన్నా-శ్రీవారి హాయాములో-

ముక్త్యాల పరగణాలో పుట్టి పెరిగి, - ప్రభువువారి పశుగణాన్ని కనిపెట్టుకుని ఉండేవాడు, సింగన్న: నడికట్టులో రెల్లు మలచిన పిల్లనగ్రోవి, మూపున రాగోల, - ఎప్పుడూ, ఏదో క్రొత్తపదం మోగించుకుంటూ, పరగణాలో బంజరు అంతా ఆలమందను మేపుకుంటూ తిరుగుతుండేవాడు సింగన్న: అక్కరవస్తే సివంగిఅంత జముకు: అంతకన్న వడి అయిన దుముకు: ఏదీ కవ్వించకపోతే-లేగదూడ వెక్కిరించే అమాయికం!

మనిషిభాషలో, మాటలు ముక్తసరిగా పదో పన్నెండో అలవాటు సింగన్నకు: అంతకన్న ఎక్కువ వాడిక లేదు మనుష్యులు మసలేచోట - రద్దీ రవ్వతో బ్రతికే నగరాన, పండుగనాడైనా కాలుపెట్టేవాడు కాదు:

మందలో ప్రతిగోవుతోనూ, ప్రతిలేగతోనూ, కంటితోనే పలుకాడేవాడు: కోరిన నడక నడిపించేవాడు:

ఓనాడు, ఏదో, మామూలు కోవలో, మంద మేపు కుంటూ,- జువ్వినీడను కూర్చున్నాడు: ఉన్నట్టుండి అల్లంత దూరాన డెక్కల చప్పుడైంది: సవ్వడి, క్రమంగా, ఈవంక కే చేరువైంది: జువ్వినీడ విడి,- మర్రిమొగకు ఎగసాడు: అద్దరి కొండగడచి, ఏదో దండు, మూకగట్టుకుని దుముకుతూంది: ఎవరో అనుకున్నాడు: ఎటు దుమికినా మన కేంలే! అను కున్నాడు: అక్కడే కూర్చుని, పిల్లనగ్రోవి అందుకున్నాడు:

దండు, మర్రిజాడకు వచ్చింది: అన్నీ దుమ్ము కొట్టు కున్న మొగాలు: నడిఎండలో మిటమిటలాడే నాపబండల వంటి మొగాలు: ఏ రెప్పలోనూ మెత్తని వాలిక లేదు.- ఏ నుదురునా నునుపు లేదు:

ఎన్నడూ, పుట్టి బుద్ధెరిగినతరువాత, అంత కరువైన కవళిక ఏ మొగానా చూడలేదు, సింగన్న: అవేం మనుషులో అనుకుని అట్టె ఆకళించి చూస్తున్నాడు:

ఈ చూపుకు చెట్టు మొగదల ఉన్న చూపులు, చుర చురా నాటినాయి: క్రింద మనుషులు చెట్టుకు ఎగనెక్క వస్తున్నారు: క్రింద విచ్చుకత్తులు ఝుామ్మని మెరుస్తూ కొర కొరలాడుతున్నాయి: సింగన్న, నిడిబారుకొమ్మనుఅంటు కుని చీమల్లె ప్రాకిపోయి, సివ్వంగికిమల్లె దుమికాడు: ఒక్క అరుపు అరిచాడు: అరుపులోనే రాగోల అందుకుని, మళ్ళి కుప్పించాడు:

ఆదూాకు మందంతా అందుకుంది: ఏకబారున వర

దూసిన బాకులల్లె కొమ్ములు ముందుకువంచి,- సింగన్నకు వెన్నుకాపుగా నిలిచింది:

దండు అలాగే నిలబడిపోయింది:

"మాతో కయ్యమెందుకూ-మీదోవ పుచ్చుకొండి-పోయే మనుషులు, నురుగుపాలు త్రావి మరీపొండయ్యా!" అన్నాడు సింగన్న: "చేపండే తల్లుల్లారా!-తలకుమాసిన దరిద్రులొచ్చారు:" అని, పాలతల్లులతో పలికాడు:

"మేం, దరిద్రులమా?" అన్నదొక త్తి:

"కాకపోతే-మా సీమలో కాలుపెడతారా?- పుట్టిన గడ్డమీద గూడుంటే,-కట్టుకున్న ఆలుంటే-ముప్పొద్దులా బువ్వుంటే-యిలా దుమ్ముకూ ధూళికీ కొట్టుకొస్తారా?-" హరికథ చెప్పినట్లు అడుగు ముందుకు వేస్తూ అంటున్నాడు, సింగన్న:-

అన్నికత్తులూ,పిడికిలిబిగిసి గాలిలో పదునాడినాయ్:-

"ముక్కలుగా చెండుతామ్!" అని ఒక్కవాటంలో రాపాడినాయి:

-"ఆకలికి అక్కరవస్తాయూ? - మీ మొగంలే-వెర్రి వేశాలూ చాలించండి అన్నట్టు ముంజయ్యి రేపాడు: అటు తిరిగాడు:

దండు నిలువునిలువునా మండిపోయింది: కన్నూ మిన్నూ కానకుండా, ఒక్కుమ్మడిగా ముందుకు ఉరికింది: సింగన్న, వేసేఅడుగు ఆపి, నిట్టనిలువునా మెలిదిరిగి,-ఈటల్లె దండు వెన్నుకు దూసుకు పోయినాడు: దండులో అన్ని గుండెల్లోకీ, జమిలి కొమ్ములు దిగిపోయినాయి:

సింగాలకు లేనిసత్తువ గంగిగోవులకు వచ్చింది! ఎండి రాలిన ఆకుల్ని గుచ్చి తిన్నట్టు, దండునంతా పొడిచేసి, తల విసురున పక్కకు గిరవాటు వేసినాయి: చెక్కుచెదరకుండా, ప్రవాహంలో దిగి, కొమ్ముల జీర కడుక్కొని, పట్టుమీద విచ్చుకుపోయి, దేనిమానాన అది లేగల్ని ఓకంట కని పెడుతూ, మేస్తూన్నది:

సింగన్న మనసు చివుక్కుమన్నది: "నేనులేను ఓతల్లు ల్లారా! కొమ్ములకు పండుగ మనసైతే- పారాణి నేను పూయనా?-ఆ గుండెలు డొల్ల,-ఆ రక్తం బురద: నాకోసం శుద్ధీబుద్ధీ చెరుపుకుంటారా! " గోవులన్నింటికీ సింగన్న మనసు తెలిసిందే!-అడక్కుండా దురుసుతనానికి పోయినామే, అని కించపడుతూ బెదురుకుచూపులుచూసినాయ్: సిగ్గుపడి తలవంచుకున్నాయి; ఎన్నడూలేనిది,-చిరాకుపడి,- బిడ్డల మీాది కసురుకున్నాయ్.

——ఎక్కడో పుల్లరిబయలులో ఏ మూలనో, గుట్టు చప్పుడుకాకుండా జరిగిన సాహసం, చరచరా ప్రభువు సన్ని ధికి ప్రాకిపోయింది:సింగన్న సముఖానికిరావలెనని,సెలవైంది:

సింగన్న, మందను విడిచి రాలేనని విన్నవించు కున్నాడు: ప్రభువు మాటకు, ఆజ్ఞకు తిరుగులేదని వార్త తెచ్చిన వేగు, తెలియచెప్పాడు: తానూ అంతే అన్నాడు సింగన్న: వచ్చిన వేగు, బ్రతిమాలి చేతగాక వెళ్ళిపోయి నాడు: సముఖంలో యీ మాట చెప్పడానికి జంకాడు:

ఓరకంట చూసే మనసు అర్థంచేసుకునే వెంకటాద్రి ప్రభువు, తాను స్వయంగా సిబ్బందితో బయలుదేరాడు,

సింగన్నకు దర్శనం యివ్వడానికి – పరగణాలో ఏ మూలనో ఉన్న వెర్రిగొల్లకోసం, ప్రభువు తరలివెళుతున్నాడంటే ప్రజలకు విడ్డూరంగా ఉంది: రాణివాసం కూడా, వేడుకకు తరలింది:

ఆలమందంతా, ప్రభువును పసికట్టి, బరాబరులుచేసింది కాని.–సింగన్న ప్రభువుతో పల్లెత్తి పలుకలేదు: చూసి చూడగానే, ఆ కన్నుల పండువకు చేతులు జోడించాడు – అంతే :–

"ఏంకావాలో! కోరుకో" అన్నాడు ప్రభువు:

"నాకేం కావాలి!" అని తనలోతాను గొణుక్కున్నాడు, సింగన్న :

"నేరనివాడు ప్రభూ!" అని ప్రెగ్గడ మనవిచేశాడు :

"నేరనివాడంటూమాపాలనలో ఒక్కడన్నా ఉండటం మనకెంత దొడ్డరికమండీ!" అని ప్రభువు ప్రెగ్గడను మందలించినట్టు చనువుగానే పలికి, – సింగన్నను చేరదీసుకున్నారు: "నాయనా, మమ్మల్నిమించిన మొనగాడివయ్యా!" అని పెదవి విప్పారు:

అతనిమాలిమిలో పెరిగిన మందనంతా సింగన్నపరం చేసి, – మంద మేసుకొచ్చినంతపట్టూ అతడికే ధారాదత్తమని సెలవిచ్చి, ప్రభువు, ఎంతో వేడుకగా, తిరిగి నగరికి వేంచేశారు:

సింగన్న ఒక్కడేమిగిలాడు: ప్రభువు తనను స్వయంగా చూడవచ్చాడని ఉబలాటమూ లేదు: కనుచూపు మేరంతటికీ

ఖామందునై నానుగదా అని,-సంబరమూ లేదు: తన చూపే తనది; తన పాటే తనది:

కాని, ఆ ఒంటిపాటు అట్టేకాలం నిలువలేదు : రాణి వాసంలో, - పరిజనంలో వయసు అందుకున్న చిన్నది - మల్లిక - సింగన్న మొగసిరిమీద కన్ను వేసింది: ముగుదల అందుకుని, ఆపట్టునే నిలిచిపోయింది:

దూరదూరంగా నిలిచింది, వోరగా చేరువైంది: నీడల్లే అయింది :

వయసుకు వన్నైనట్టు పలికింది :- సింగన్న ధోరణి అటుమరలింది కాదు :

మనసువిప్పింది: మౌనంగా చెప్పింది: బలవంతాన తన పస అలవాటు చేసింది: కాని, అంత సంబరంలోనూ సింగన్న చూపు అటు మళ్ళించుకోలేకపోయింది:

వన్నెవన్నెల పూలుతురుముకునేది: ఒక్కచోటనిలువకుండా చెంగేది: నీరెండలో మెరుగు తెచ్చుకుంటో ఒళ్ళంతా ఒక్కకులుకులో విరుచుకునేది: ఆ విరుపులోనే, ఒడుపుగా చేతులు అందిచ్చేది - సింగన్న అల్లంతదూరాన ఎక్కడో, ఒక్కటే ధ్యాసలో ఉండేవాడు:

మల్లిక ఎంతో నూరిపోసింది: ఈ సీమకంతా నీవే రాజువు : కోటకట్టుకో; కులంవారిని కూడదీసుకుని ఏలుకో.- గద్దెమీద, నా సరసను కాలుమీద కాలు వేసుక కూర్చో! ఇన్నాళ్ళూ పాలమీద బ్రతికావు: ముప్పొద్దులూ బంగారం తినవచ్చు: ఠీవిగా సుఖపడచ్చు!-

సింగన్న, అదేమీ అర్థంకానట్టు, వినిపించుకోనట్టు

ఉండేవాడు: "తండ్రికి బిడ్డమీద దయఉంటే,–తానుండగానే పంచియిస్తాడా?–" ఇలా దిగులుపడేవాడు: "ప్రభువు ఏలే పరగణాలో ఇంతకాలం బ్రతికాను; మీకు, సింగన్నదొరా, తల్లుల్లారా!" – తలఎత్తి గోవులవంక చూడలేక బిడియపడే వాడు: ఇలాగే ఎన్నిప్రొద్దులో గడిచిపోయినాయి: ప్రభువుకు, ఈ వైనమేమీ తెలియకపోయె సుమీ!

దివాణంలో చల్లగా పెరిగిన మల్లిక, – ఈ బ్రతుకు బ్రతకలేకపోయింది: మనసు రాయి చేసుకుంది: విడిచి వెళ్ళి పోదామనుకుంది: తనపోరు లేకపోతే, – అతడికన్నా మనసు మళ్ళుతుందేమో, తానైనా సుఖంగా ఉంటాడు కదా అనుకుంది:

అడుగు ముందుకు వేసింది – పడలేదు:

అక్కడే కూచునిపోయింది:

ఎండ మిడిమిడిగా – కాల్చుకుతిన్నది. పుట్టి పెరిగిన దంతా కలగానూ,–యీ బ్రతుకే నిబద్ధిగానూ అనిపించింది:– కూచునిలేచే సత్తువ లేకపోయింది:

ఎప్పుడూ పచ్చతోరణంతో కలకల్లాడే కోట – నిత్య కల్యాణంగా ఉండే దివాణం, ఎందుకో తనమీద కత్తిదూసి నట్టు జడుసుకుంది – అంత దిగులులోను, – అనుభవించిన సుఖం తలచుకుని, – అల్లంతలో, – నవ్వుకుంది – నవ్వులోనే ఒరిగిపోయింది:

అంతకు అంతలోనే,–ఆవులన్నీ, – బసవన్నలై రంకె వేసినవి: మందకొడిగా ఉన్న సింగన్నను కుమ్మినట్టు తరిమి వేసినవి–

నేల అంటిముట్టకుండా తేలిపోయే కాళ్ళకు, పోగా పోగా, - ఏకడనో, - మల్లెతీవె పెనవేసుకుని నిలిపేసింది : అంతలో మారాకువేసింది, - మొగ్గతొడిగింది: అల్లంత విచ్చింది: చిరునవ్వు మెరిసినంత పట్టువుంది -తీవె, - పూవూ పచ్చపట్టులో,-కానరాకుండా కలిసిపోయింది :

ఆ. కాళ్ళు ఇక అక్కడ నిలువలేదు: ఎటోపోయినవి : ఎక్కడో చల్లైయిపోయినవి: సింగన్న అదే తొలిసారి గొంతు విప్పి, - "మల్లికా!" అని అంబా - అన్నాడు: ఆపిలుపుకు ఆకాశం వెన్నంటుకున్న వెలుగు, పేరిన ముద్దగా రాలిపడి,- సింగన్నను కరువున పోసింది; ఆ బొమ్మ అలాగే, - వెలుగు మల్లే వేళకు. - కుదించుకు పోయింది—

ఆవులమంద, దివాణంముందుచేరి, అంగలార్చింది: వాపోయింది: ప్రభువును తరలించుకవచ్చి, - మల్లిక మాయమైన చోటు, - సింగన్న, క్రుంగిపోయినపట్టూ, రాపాడి విశదపరచింది: ఆ కథఅంతా కళ్ళకు కట్టినట్టుకాగా,— అంతటి ధీరుడూ పసిపాపడై పోయినాడు: మన్నించమని ఆలమందకు కేలుమోడ్చాడు :

మల్లిక నవ్వినచోట, లేమల్లె: సింగన్న మనసు తెలిసిన చోటు - సింగారం:-అవి రెండూ, ఆ పరగణాలో కలకాలం నిలిచే గ్రామాలు:-